సాక్షి
అనంతపురం

బుధవారం। 20। ఆగస్టు। 2025



యూరియా 'నోస్టాక్'

అనంతపురం డీసీఎంఎస్ కార్యాలయం వద్ద మంగళవారం యూరియా నో స్టాక్ బోర్డు పెట్టడంతో రైతులు ఆందోళనకు దిగారు. 8లో



టమాట కిలో రూ.46

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.47 పలికింది. కనిష్టం రూ.34, సరాసరి రూ.24 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
30.2°/21.4°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షపాతం నమోదైంది. పశ్చిమ దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

24న టీటీసీ పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) పరీక్షలు ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ జి. వెంకటేష్ తెలిపారు. మూడు విడతలుగా పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఉదయం 11 నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, 3.30 నుంచి 4.30 గంటల వరకు ఉంటాయన్నారు. మొదటి రోడ్డులోని నగరపాలక బాలికల ఉన్నత పాఠశాలలో కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉన్నాయని సూచించారు. హాల్‌టికెట్‌తో పాటు పాన్/ఓటర్ ఐడీ/ఆధార్/డ్రైవింగ్ లైసెన్స్ తదితర గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని తెలియజేశారు. గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అభ్యర్థులకు సూచించారు.

జిల్లాకు 1,016 మెట్రిక్ టన్నుల 'కాంప్లెక్స్'

అనంతపురం అగ్రికల్చర్: ఫ్యాక్ట్ కంపెనీకి చెందిన 1,016 మెట్రిక్ టన్నుల 20-20-0-13 రకం కాంప్లెక్స్ ఎరువులు మంగళవారం జిల్లాకు చేరినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌లో వ్యాగన్ల ద్వారా వచ్చిన కాంప్లెక్స్‌ను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు 826 మెట్రిక్ టన్నులు ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేసి, మిగతా 190 మెట్రిక్ టన్నులు కంపెనీ గోదాములో నిల్వ చేయనున్నట్లు తెలిపారు.

ఇంటర్న్‌షిప్ క్రెడిట్ల కుదింపు.. లాంగ్వేజ్‌ల పొడిగింపు

- నేడు డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్

అనంతపురం: డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ బుధవారం జారీ కానుంది. సంప్రదాయ డిగ్రీ అడ్మిషన్లలో ప్రభుత్వం మార్పులు చేసింది. కళాశాలలో విద్యార్థి దరఖాస్తు సమర్పించే సమయంలో కచ్చితంగా ఆధార్ అథెంటిఫికేషన్ తీసుకోవాలని సూచించింది. ఎలా దరఖాస్తు చేసుకున్నప్పటికీ మెరిట్ ఆధారంగానే సీట్లు భర్తీ చేస్తారు. ఒక్కో కోర్సులో 15 శాతం సీట్లు షెడ్యూల్డ్ కులాలకు కేటాయిస్తారు. వీటిల్లో గ్రూప్-1(12 కులాలు)ఒక శాతం,గ్రూప్ 2 (18 కులాలు)కు 6.5 శాతం, గ్రూప్ 3 (29 కులాలు)కు 7.5 శాతం విభజించారు. తాజాగా ప్రతిపాదించిన మేజర్-కోర్ సబ్జెక్టుకు కేవలం 44 క్రెడిట్లు ఇచ్చారు. మేజర్ ఆప్షనల్‌కు 16 క్రెడిట్లు కేటాయించారు. తాజాగా ప్రభుత్వం ప్రతిపాదన ప్రకారం మూడేళ్ల డిగ్రీకి 126 క్రెడిట్లు నిర్దేశించారు. ఇందులో లాంగ్వేజెస్‌ను మూడో సెమిస్టర్ వరకు పొడిగించారు. ఉద్యోగ, ఉపాధి కల్పనలో మార్కెట్ ఓరియెంటెడ్ విధానాన్ని అలవర్చే ఇంటర్న్‌షిప్‌ను తగ్గించారు. పేరుకు రెండు మేజర్ సబ్జెక్టులు చూపించినప్పటికీ అందులో ఒకటి ఆప్షనల్ కావడం, వాటికి కేవలం 16 క్రెడిట్లు మాత్రమే కేటాయించడం గమనార్హం. ఇలా చేయడంతో పీజీ చేసుకునే అవకాశం ఉండదు. ఇక మేజర్ కోర్ సబ్జెక్టుకు సంబంధించిన అంశాన్నే ఆప్షనల్ మేజర్‌గా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

'నక్ష'ను గడుపులోపు పూర్తి చేయాలి

- సీడీఎంఏ సంపత్‌కుమార్



సీడీఎంఏ సంపత్‌కుమార్‌ను కలిసి సమస్యలు విన్నవిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్ (నక్ష)' కార్యక్రమాన్ని 45 రోజుల్లో పూర్తి చేస్తే రూ.50 కోట్లు నగరపాలక సంస్థకు వస్తాయని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ పని చేయాలని డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) సంపత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నగరపాలక సంస్థలో ఉమ్మడి జిల్లాల కమిషనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పక్కాగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తుల సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. నగరపాలక సంస్థ, మునిసిపాలిటీల్లో పన్నులపై సర్వే చేయాలన్నారు. దెబ్బతిన్న రోడ్లు, కాలువలకు మరమ్మతు చేయించాలన్నారు. సమావేశంలో కమిషనర్ బాలస్వామి పాల్గొన్నారు.

కుక్కల బెడదకు పరిష్కారం చూపాలి

నగరంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, శునకాల బెడదకు పరిష్కారం చూపాలని మేయర్ వసీం డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. గతంలో కంపోస్టు యార్డులో కుక్కల బెడదకు స్టెరిలైజేషన్ చేశారన్నారు. అనంతరం సంపత్‌కుమార్ కంపోస్టు యార్డును పరిశీలించారు. మేయర్ వెంట కార్పొరేటర్లు ఇసాక్, కమల్‌భూషణ్, వైఎస్సార్ సీపీ నాయకులు చింతకుంట మధు తదితరులున్నారు.



- ఈ యువతి పేరు హర్షిత. చేతులు, కాళ్లు పనిచేయవు. మాటలు కూడా రావు. పక్కకు కూడా కదిలే పరిస్థితి లేదు. కనీసం ఆకలి అని కూడా చెప్పలేదు. ఉదయం తల్లిదండ్రులు ఎక్కడ కూర్చోబెడితే సాయంత్రం వరకు అక్కడే ఉంటుంది. గతంలో ఈమెకు రూ.15 వేలు పింఛన్ అందేది. కూటమి ప్రభుత్వం ఇటీవల రూ.6 వేలకు తగ్గించింది. రీవెరిఫికేషన్‌కు వచ్చిన వైద్యులు కనీసం ఇంటి లోపలికి కూడా రాకుండా బయట నుంచే చూసి ఇలా చేశారని తల్లిదండ్రులు చెబుతున్నారు.

కళ్ల ముందే దైన్యం..
కూటమి దుర్మార్గం



గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగిన దివ్యాంగులు



- ఫొటోలో కనిస్తున్న వృద్ధురాలి పేరు గీతాబాయి. అనంతపురం నగరంలోని ఉమానగర్‌లో నివాసముంటోంది. పుట్టుకతో బుద్ధిమాంద్యం సమస్యతో బాధపడుతోంది. 20 ఏళ్లుగా పింఛన్ తీసుకుంటోంది. ఇటీవల కూటమి ప్రభుత్వం పునఃపరిశీలన అంటూ చెప్పడంతో కుటుంబీకులు సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ఆమెను పరిశీలించి వైకల్యం తాత్కాలికమంటూ నమోదు చేశారు. దీంతో గీతాబాయి పింఛన్ రద్దు చేస్తున్నట్లు కమిషనర్ పేరున నోటీసు జారీ చేశారు.



- ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు గోగుల శాంతమ్మ. రాప్తాడు మండలం ఎం.చెర్లోపల్లి గ్రామం.ఈమె ఆరేళ్ల క్రితం చింత చిగురు కోసం చెట్టెక్కి కాలుజారి కింద పడడంతో వెన్నుపూస విరిగింది. అప్పట్లో కుటుంబీకులు బెంగళూరు, తిరుపతి, చెన్నై లాంటి నగరాలకు ఆమెను తీసుకెళ్లి లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా ఆరోగ్యం కుదుట పడలేదు. మంచానికే పరిమితమైంది. శాంతమ్మను కుటుంబ సభ్యులు కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. యూరిన్ కూడా సహజంగా రాకపోవడంతో వైద్యులు పైపు ద్వారా వెళ్లేలా చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో రీ వెరిఫికేషన్ పేరిట ఈమెకు వికలత్వం 50 శాతం ఉన్నట్లుగా కూటమి ప్రభుత్వం నిర్ధారించింది. గతంలో అందే రూ.15 వేల పింఛన్‌ను రూ.6 వేలకు తగ్గించేసింది.

దివ్యాంగులు.. ఆర్తనాదాలు

- రీ వెరిఫికేషన్ మాటున బాబు సర్కార్ కుట్రలు
- దయ లేకుండా దివ్యాంగుల పింఛన్ల కట్
- మరికొందరికి పింఛన్ డబ్బు తగ్గింపు
- గగ్గోలు పెడుతున్న బాధితులు
- అధికారుల వద్దకు పరుగులు

గుంతకల్లు రూరల్/రాప్తాడు: కొలువుదీరి రెండేళ్లు కావొస్తున్నా ఒక్క కొత్త పింఛన్ మంజూరు చేసిన పాపాన పోలేదు. ప్రభుత్వం ఎప్పుడు కొత్త పింఛన్లు మంజూరు చేస్తుందా, కష్టాలు ఎప్పుడు తీరుతాయా అని చాలా మంది ఎదురు చూస్తున్నారు. కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియను విస్మరించిన కూటమి ప్రభుత్వం ఉన్న పింఛన్లను తొలగిస్తుండడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. మొట్టమొదట వికలాంగ పింఛన్లపై పడి దయ లేకుండా తొలగిస్తూ వారిని రోడ్డుపై పడేస్తుండడంతో ప్రభుత్వ తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. అర్హులైన వికలాంగులకు పింఛన్ తొలగించి కూటమి ప్రభుత్వం పాపం మూటకట్టుకోగా.. వికలాంగులకు అది శాపంగా మారింది.

అధికారుల వద్దకు పరుగులు..

జిల్లావ్యాప్తంగా ఇటీవల వికలాంగ పింఛన్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టారు. చాలా మందిని అనర్హులుగా తేల్చి నోటీసులు అందజేశారు.వైకల్యంతో బాధపడుతూ ప్రభుత్వం ఇచ్చే డబ్బుపైనే ఆధారపడి కాలాన్ని నెట్టుకొస్తున్న తరుణంలో పింఛన్ తొలగించడంతో వికలాంగులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఎన్నో ఏళ్ల నుంచి అందిస్తున్న పింఛన్లను అకారణంగా ఎందుకు తొలగించారో అర్థం కాక, ఏమి చేయాలో దిక్కుతెలియక తమకు న్యాయం చేయండంటూ నిత్యం ప్రభుత్వ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు.

నగరంలో 1,176 పింఛన్ల కట్

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లకు సంబంధించి మొత్తం 22,668 పింఛన్లు ఉన్నాయి. ఇటీవల 3,688 మంది దివ్యాంగులకు నగరపాలక సంస్థ సచివాలయ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. ప్రతి ఒక్కరూ పింఛన్ పునఃపరిశీలనకు హాజరు కావాలని తేల్చి చెప్పారు.

తీరని అన్యాయం..

వికలత్వానికి సంబంధించి లబ్ధిదారులకు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పునఃపరిశీలన చేశారు.ఆర్థో, సైకియాట్రీ, మూగ, చెవిటి, కంటి, బుద్ధిమాంద్యం, తదితర విభాగాలకు సంబంధించి లబ్ధిదారులను పరిశీలించారు. అందులో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వైద్యులు లబ్ధిదారులకు తీరని అన్యాయం చేశారని సమాచారం. పూర్తి వికలత్వం ఉన్న వారిని సైతం తాత్కాలిక వైకల్యం అని నమోదు చేశారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు నగరంలో ఏకంగా 1,176 మంది వికలాంగుల పింఛన్లు రద్దు చేసినట్లు, వచ్చే నెల నుంచి పింఛన్ రాదంటూ కమిషనర్ పేరున లబ్ధిదారులకు నోటీసులు జారీ చేశారు. దీంతో లబ్ధిదారులు, వారి తల్లిదండ్రులు ఆవేదనలో మునిగిపోయారు. తమకు అన్యాయం చేశారంటూ మంగళవారం పెద్ద ఎత్తున నగరపాలక సంస్థ, ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలి వచ్చారు. ఏళ్ల తరబడి పింఛన్ తీసుకుంటున్న తమకు ఎందుకు అన్యాయం చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, రానున్న రోజుల్లో మరో వెయ్యి మంది వరకు వికలాంగుల పింఛన్ కోత విధించేందుకు సర్కార్ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆందోళన

గుంతకల్లు:కొన్నేళ్లుగా పింఛన్ తీసుకుంటున్నామని .. రీ వెరిఫికేషన్ పేరుతో ఇకపై పింఛన్ తీసుకునే అర్హత లేదంటూ నోటీసులు జారీ చేశారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట గుంతకల్లు, గుత్తికి చెందిన లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ పింఛన్ డబ్బుతో జీవనం సాగించే తమపై వివక్ష చూపొద్దంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఉన్నఫలంగా కట్ చేస్తే వైద్య ఖర్చులు, కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారులతో వాగ్వాదం



గుత్తిలో మున్సిపల్ అధికారులతో వాగ్వాదం చేస్తున్న లబ్ధిదారులు

గుత్తి: అన్యాయంగా పెన్షన్లు రద్దు చేశారంటూ లబ్ధిదారులు మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. గుత్తి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 137 పెన్షన్లు రద్దయ్యాయి. మరో 17 పెన్షన్లు కన్వర్ట్ చేశారు. సాంకేతికంగా మొత్తం 154 పెన్షన్లు తొలగించారు. ఈ మేరకు నోటీసులు రావడంతో పలువురు లబ్ధిదారులు మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. ఎందుకు తమ పెన్షన్లు రద్దు చేశారని మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమకు ఎలాంటి సంబంధం లేదని, ప్రభుత్వం ఆదేశాలు మాత్రమే తాము పాటిస్తామని అధికారులు చెప్పారు. తమ చేతుల్లో ఏమీ లేదని చెప్పడంతో లబ్ధిదారులు ఆవేదనతో వెనుదిరిగారు.

వైకల్యం కనపడడం లేదా?



నా బిడ్డ నివేదికకు మానసిక పరిస్థితి బాగా లేదు. కాళ్లు చచ్చుపడిపోయాయి. కూర్చోలేదు.. నిలబడలేదు. బయటకు ఎక్కడికైనా సరే ఎత్తుకొని తీసుకెళ్లాల్సిందే. గతంలో 90 శాతం వికలత్వం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్ జారీ చేశారు. ఇటీవల పునఃపరిశీలనలో తక్కువ ఉన్నట్లు చూపారు. మా పాప వికలత్వం ఈ ప్రభుత్వానికి కనబడడం లేదా? – లక్ష్మి, గుత్తి

పునరుద్ధరించకుంటే ఆందోళనలు



చూడగానే వైకల్యం కనిపిస్తున్నా దివ్యాంగులని అని పించకపోవడం దుర్మార్గం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దివ్యాంగ పింఛన్ల ఏరివేతకు ప్రాధాన్యమిచ్చింది. తొలగించిన పింఛన్లు పునరుద్ధరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

– బాలరంగయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

దిక్కుతోచడం లేదు



పుట్టుకతోనే వికలాంగుడిని. చిన్నప్పటి నుంచి పింఛన్ పొందుతున్నా. ఇటీవల తల్లిదండ్రులకు కూడా వయసు పైబడడంతో నాకు వచ్చే పింఛన్ డబ్బే కుటుంబానికి దిక్కు. ఇటీవల వెరిఫికేషన్ ప్రక్రియ అనంతరం నేను వికలాంగ పింఛన్‌కు అనర్హుడు అంటూ కూటమి ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. పింఛన్ నిలిపివేయడంతో కుటుంబమంతా దిక్కుతోచని స్థితిలో పడింది.

– రామాంజనేయులు, దోసలుడికి గ్రామం, గుంతకల్లు మండలం

దయచేసి పింఛన్ అందించండి



నాకు పుట్టినప్పటి నుంచి కుడికాలు పనిచేయదు. ఒక కాలిపైనే కుంటుతూ నడుస్తా. ప్రభుత్వం అందించే పింఛన్ డబ్బుపైనే ఆధారపడి కడుపు నింపుకుంటున్నా. ఇటీవల కూటమి ప్రభుత్వం 40 శాతం కంటే తక్కువ అంగవైకల్యం ఉందంటూ పింఛన్ నిలిపివేసింది. నాకు ఎలాగైనా పింఛన్ అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నా.

– గిలక పార్వతి, కదిరిపల్లి గ్రామం, గుంతకల్లు మండలం

ఉన్న ఫళంగా ఆపేశారు



మరుగుజ్జు సమస్యతో బాధపడుతున్నా. ఎక్కువసేపు నిలబడటానికి రెండుకాళ్లు సహకరించవు. నాకు 92 శాతం అంగవైకల్యం ఉన్నట్లుగా గుర్తించిన వైద్యులు గతంలో ఆ మేరకు సదరం సర్టిఫికెట్‌ను మంజూరు చేశారు. ఇటీవలి వరకూ నేను పింఛన్ తీసుకున్నా. అయితే, ఉన్నఫళంగా కూటమి ప్రభుత్వం పింఛన్‌ను తొలగించింది.

–అపర్ణ, గుర్రబ్బాదు గ్రామం, గుంతకల్లు మండలం

ప్రజలు నన్ను అడ్డుకుంటే ఇళ్లు రాసిస్తా

- తాడిపత్రికి వెళ్లాలంటే వీసా ఏమైనా కావాలా? : మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి



పుట్లూరు మండలం సూరేపల్లి వద్ద కేతిరెడ్డి పెద్దారెడ్డిని అడ్డగించిన పోలీసులు

అనంతపురం కార్పొరేషన్: 'నేను తాడిపత్రికి వెళితే శాంతిభద్రతలకు విఘాతం కల్గుతుందని పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారు. తాడిపత్రికి వెళ్లాలంటే ఏమైనా వీసా కావాల్నా..? నన్ను నిజంగా అక్కడి ప్రజలు రాకుండా అడ్డుకుంటే నా ఇళ్లు రాసిస్తా' అని వైఎస్సార్ సీపీ తాడిపత్రి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాడిపత్రికి వెళ్లేందుకు హైకోర్టు ఉత్తర్వులున్నా పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తమ కార్యకర్తలపై కేసులు నమోదు చేశారంటూ జేసీ ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. వన్‌సైడ్ కేసులు ఎక్కడా నమోదు చేయలేదన్నారు.ప్రస్తుతం వైఎస్సార్ సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని దాడులు, అక్రమ కేసులను జేసీ ప్రభాకర్ రెడ్డి సూచనలతో పోలీసులు నమోదు చేస్తున్నారన్నారు. అభివృద్ధి గురించి పట్టించుకోకుండా తనను తాడిపత్రికి రాకుండా పోలీసులతో ఆంక్షలు విధించడం సరికాదన్నారు. 700 మంది పోలీసులతో తనను ఎక్కడికీ వెళ్లకుండా అడ్డుకోవడం ఎంత వరకు న్యాయం అని పోలీసు ఉన్నతాధికారులను ఆయన ప్రశ్నించారు. పోలీసుల గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో ఒకసారి ఇంటెలిజెన్స్ సర్వే చేసుకుంటే తెలుస్తుందన్నారు. తాడిపత్రిలో ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి ఉన్నాడా లేడా అన్న క్లారిటీ ఇవ్వాలని సీఎం చంద్రబాబును కోరారు. నిజంగా తాను తప్పు చేసి ఉంటే విచారణ చేయాలన్నారు. అదేవిధంగా 420, గజదొంగ, అక్రమార్కుడైన జేసీ ప్రభాకర్ రెడ్డిపై సీబీఐ, సిట్‌తో విచారణ చేయిస్తే తాడిపత్రిని నాశనం ఎవరు చేస్తున్నారో అందరికీ తెలుస్తుందని ఆయన సూచించారు. ఇప్పటికీ ప్రభాకర్ రెడ్డి వసూళ్లకు పాల్పడుతున్నాడని విమర్శించారు.

మారని పోలీసుల తీరు...

సాక్షి టాస్క్‌ఫోర్స్: చట్టానికి లోబడి విధులు నిర్వహించాల్సిన పోలీసులు హైకోర్టు ఆదేశాలు బేఖాతరు చేస్తూ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని తాడిపత్రికి వెళ్లకుండా అడ్డుకోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. సోమవారం హైకోర్టు ఉత్తర్వుల మేరకు తాడిపత్రికి వెళ్తున్న కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు పుట్లూరు మండలం నారాయణరెడ్డిపల్లి వద్ద అడ్డగించిన విషయం విదితమే. మంగళవారం మరోమారు పుట్లూరు మండలం సూరేపల్లి వద్ద సీఐ సత్యబాబు సిబ్బందితో కలిసి మాజీ ఎమ్మెల్యేను తాడిపత్రికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అనంతపురం వెళ్లిపోయారు.

తాడిపత్రిలో హైఅలర్ట్

తాడిపత్రిలో హైఅలర్ట్ నెలకొంది. పట్టణంలో మంగళవారం పోలీస్ బలగాలతో ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి కవాతు నిర్వహించారు. ఇరుపార్టీల నాయకుల ఇళ్ల వద్ద భారీ బందోబస్తు చేపట్టారు. దీంతో పట్టణ ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

రాళ్లు రువ్వేందుకు ప్రయత్నిస్తే కాల్చిపారేస్తాం..

అల్లరి మూకలు రాళ్లు విసిరేందుకు ప్రయత్నిస్తే కాల్చిపారేస్తామని ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి హెచ్చరికలు జారీ చేశారు. కవాతు సందర్భంగా ఏఎస్పీ విలేకరులతో మాట్లాడారు. తాడిపత్రిలో శాంతిభద్రతలకు విఘాతం కల్గించాలని చూస్తే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. నాయకులు, కార్యకర్తలు హద్దు దాటి ముందుకు వచ్చినా, రాళ్లు రువ్వేందుకు ప్రయత్నించినా టియర్‌గ్యాస్ ఉపయోగిస్తామన్నారు. లాఠీ చార్జ్ చేసేందుకూ వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు.

23న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

అనంతపురం అర్బన్: వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఈనెల 23న నిర్వహించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల నివారణ, అంటు వ్యాధులు అరికట్టడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. మురుగునీటి కాలువలు శుభ్రం చేయడంతో పాటు గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉదయం 6 గంటల నుంచి 7 గంటల్లోపు చెత్త తొలగింపు, ట్యాంకుల శుభ్రం, క్లోరినేషన్ 100 శాతం చేపట్టాలన్నారు. 'ఉపాధి' పథకం కింద వ్యక్తిగత, కమ్యూనిటీ సోక్ పిట్‌లు గ్రౌండింగ్ చేయడంతో పాటు పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజు నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అధిష్టానం ముందు అరాచకాల చిట్టా

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన 40 మంది అనంత వాసులు
- ప్రజాప్రతినిధి వేధింపులపై ఆధారాలతో సహా ఫిర్యాదు



బాధితుల వినతులు స్వీకరిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్

అనంతపురం క్రైం: 'అనంత'లో టీడీపీ పరువు రోడ్డున పడింది. ప్రజా ప్రతినిధి ధనదాహం ఓ వైపు, తమ్ముళ్ల దౌర్జన్యాలు మరో వైపు... నామినేటెడ్ పోస్టుల పేరుతో డబ్బు వసూళ్ల నుంచి మద్యం దుకాణాల్లో మామూళ్లు.. పేదల బియ్యం కోటాలో వాటాలు... విలువైన భూముల్లో కంచె వేసి కబ్జా చేయడం లాంటి అనేక ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ముందు బాధితులు ఉంచారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు... అనంత ప్రజాప్రతినిధి దౌర్జన్యాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాలను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు వివరించారు. మంగళవారం సాయంత్రం 40 మంది బాధితులు విజయవాడలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. జరిగిన అన్యాయాలపై 'పల్లా'కు విన్నవించుకున్నారు. ప్రధానంగా అనంత నగర శివారులోని 210 సర్వే నంబరులో భూమి కబ్జాతో పాటు నగరం నడిబొడ్డున ఉన్న అస్రా ఆప్టికల్స్‌కు సంబంధించి మైనార్టీ కుటుంబానికి జరిగిన అన్యాయంపై ఆధారాలతో సహా ఆయన ముందుంచారు. స్థానిక ప్రజాప్రతినిధి స్వయంగా నగరంలో పార్టీకి చెందిన వారిని, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు ఫోన్ చేసి బెదిరించాడని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా ప్రతినిధితోపాటు సన్నిహితుల వ్యవహార శైలితో నగరంలో చాలా మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. మద్యం దుకాణాల సిండికేట్ విషయం, అక్రమ వసూళ్ల దందాతో పాటు ఇతర వ్యవహారాల్లో ప్రజా ప్రతినిధి, అతని బంధువులు, కుటుంబ సభ్యులు, అనుంగులు చేసిన అకృత్యాలను ఆధారాలతో అందజేసినట్లు తెలుస్తోంది.

ఆ ఆడియో సంచలనం:

'అస్రా ఆప్టికల్స్'కు చెందిన మైనార్టీ కుటుంబాన్ని అత్యంత పరుష పదజాలంతో ప్రజా ప్రతినిధి దూషించిన ఆడియోని పల్లాకు వినిపించినట్లు తెలిసింది. ఈ ఆడియో విని షాక్ తిన్న ఆయన దాన్ని అక్కడే డిలీట్ చేయాలని కోరినట్లు సమాచారం. దారుణంగా మాట్లాడి... తమ ఆస్తులపై దాడులు చేసింది కాకుండా తమను ఒకానొక దశలో ఊరు కూడా వదిలిపోవాలని బెదిరించినట్లు వాపోయారు. కాగా బుధవారం నేరుగా పార్టీ అధినేతను బాధితులందరూ కలిసే అవకాశం కల్పిస్తానని చెప్పినా.. బాధితులు మాత్రం తమకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిసింది.

మాజీ ఎమ్మెల్యే సారథ్యమా?

పార్టీ అధిష్టానం పిలుపుతో బాధితులు రాష్ట్ర కార్యాలయానికి వెళ్లారా.. లేక మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి సారథ్యంలో కలుస్తున్నారా... అన్నది తెలియరాలేదు. పార్టీలో చాలా కాలంగా పని చేసిన కార్యకర్తలు, ద్వితీయశ్రేణి నేతలతో కలసి చౌదరి పార్టీ అధిష్టానాన్ని కలిసినట్లు తెలిసింది.

క్లుప్తంగా

పోక్సో కేసులో ముద్దాయికి 13 ఏళ్ల జైలు

హిందూపురం: బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన కేసులో ముద్దాయి వడ్డే బెంగళూరు సుధాకర్‌కు అనంతపురంలోని పోక్సో కోర్టు 13 ఏళ్ల జైలు, రూ.8 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. హిందూపురం వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురం లక్ష్మీపురానికి చెందిన వడ్డే బెంగళూరు సుధాకర్ స్థానికురాలైన ఓ బాలికకు మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. అనంతరం బాలికను బెంగళూరు, కదిరి తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి లాడ్జిలలో లైంగిక దాడి చేశాడు. దీనిపై 2022 జనవరి 7న బాధిత బాలిక తండ్రి హిందూపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా... వన్ టౌన్ ఎస్ఐ దాదాపీర్, సీఐ ఇస్మాయిల్ కేసు నమోదు చేసి పక్కా ఆధారాలతో నిందితుడిపై ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసు నమోదైనప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతున్న సుధాకర్ బెంగళూరులో ఉన్నట్లు గుర్తించిన స్థానిక పోలీసులు లేపాక్షి పోలీసుల సహకారంతో ఇటీవలే అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. మంగళవారం అనంతపురంలోని పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం ఎదుటకు రాగా, జడ్జి చిన్నబాబు కేసు పూర్వాపరాలను, సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి వడ్డే సుధాకర్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానాతోపాటు బాలికను బెదిరించినందుకు మరో మూడేళ్ల జైలు, రూ.3 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

ఆరిపోతున్న ఆశల దీపాలు

- చిన్న విషయాలకే ఆత్మహత్య చేసుకుంటున్న పిల్లలు
- బిడ్డలపై దృష్టి సారించాలంటున్న నిపుణులు



రాయదుర్గం: చిన్న చిన్న కారణాలకే ప్రాణాలు తీసుకుంటున్న పిల్లల సంఖ్య క్రమంగా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. నిండు నూరేళ్లు బతకాల్సిన పసి మొగ్గలు అర్ధంతరంగా తనువు చాలిస్తూ కన్నవారికి, అయినవారికి తీరని వేదన మిగుల్చుతున్నారు. బతుకుపై భారం లేదు.. కష్టపడి సంపాదించాలన్న ఆలోచన ఉండదు.. అలనా పాలనంతా తల్లిదండ్రులే చూస్తారు. పిల్లల్ని ప్రయోజకుల్ని చేయాలనే సంకల్పంతో ఉన్నదంతా వారి ఎదుగుదలకే ఖర్చు చేస్తారు.. అయినా, అలాంటివేవీ పట్టించుకోకుండా బలవన్మరణాలకు పాల్పడుతుండడం కలవరపరుస్తోంది. అవగాహన కల్పించి అరికట్టడంలో అధికారులు విఫలం చెందుతున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఈ నెల 3న రాయదుర్గం మండలంలోని టీ వీరాపురం గ్రామంలో శ్వేత (14), మౌనిక (9)లు తమ ఊరి చివర్లో దొణగంగమ్మ ఆలయం పక్కన ఉన్న నీటి కుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. అయిన వారికి తీరని శోకం మిగిల్చారు. శ్వేత తమ ఇంట్లో గ్యాస్‌స్టవ్‌పై పాలుకాస్తూ మరచి పోవడంతో పాలన్నీ ఇంకి గిన్నె మాడిపోయింది. దీంతో ఇల్లంతా పొగలు కమ్ముకున్నాయి. పొలానికి వెళ్లిన ఇంటికి వచ్చాక తల్లిదండ్రులు మందలిస్తారనే భయంతో ఆత్మహత్య చేసుకోగా.. స్నేహితురాలి మృతిని తట్టుకోలేక మౌనిక కూడా బలవన్మరణానికి పాల్పడింది.

ఏడు రోజులు క్రితం కణేకల్లు మండలం నల్లంపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థి అరవింద్ (15) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇటీవల అరవింద్ పాఠశాలకు తరచూ దుమ్మాకొట్టి తల్లి వెంట వ్యవసాయ పనులకు వెళ్లేవాడు. పదో తరగతి కీలకమని, పనులకు రాకుండా పాఠశాలకు వెళ్లాలని తల్లి గట్టిగా మందలించడంతో క్షణికావేశానికి లోనైన అరవింద్ తన తల్లి పొలానికి వెళ్లాక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వీరే కాదు.. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాదిలో ఇప్పటివరకూ సుమారు 43 మంది చిన్నారులు వివిధ కారణాలతో ఆత్మహత్యలు చేసుకున్నట్టు తెలుస్తోంది.

తల్లిదండ్రులు బాధ్యతగా మెలగాలి

పిల్లలకు కన్నవారికంటే ఆప్తులు మరొకరు ఉండరు. అలాంటిది వారే తమను అర్థం చేసుకోలేకపోతున్నారనే భావన పిల్లల్లో కలిగితే అది మానసిక సమస్యకు దారితీస్తుంది. ఇష్టాఇష్టాలతో పనిలేకుండా సొంత నిర్ణయాలు తీసుకుని వారిపై ఒత్తిడి పెంచడం సరి కాదని, చదువు, వివాహం, పెంపకం, క్రమశిక్షణ ఇలా ఏదైనా సరే తల్లిదండ్రులు బాధ్యతగా మెలగాలని నిపుణులు సూచిస్తున్నారు.




నీటి కుంటలో పడి ఆత్మహత్య చేసుకున్న బాలికలు శ్వేత, మౌనిక (ఫైల్)

కౌన్సెలింగ్‌తో మేలు

పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. అవసరమైన సమయంలో కౌన్సెలింగ్ ఇప్పించాలి. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన నుంచి బయటకు వచ్చేందుకు ప్రస్తుతం మందులు ఉన్నాయి. వాటిని వినియోగించడంలో జాగ్రత్తలు పాటించాలి.

– మెర్సీ జ్ఞానసుధ, సూపరింటెండెంట్ ఏరియా ఆస్పత్రి, రాయదుర్గం

అవగాహన కల్పిస్తున్నాం

కుటుంబాల్లో కలహాలు రేగడం సహజమే. సమస్య ఉంటే పెద్దల వద్ద కాని, సమీపంలో ఉన్న పోలీసుస్టేషన్‌ను సంప్రదిస్తే కౌన్సెలింగ్ చేస్తారు. పోలీసు శాఖ తరఫున తరచూ గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– వెంకటరమణ, రూరల్ సీఐ, రాయదుర్గం

ఇద్దరు డాక్టర్లు, స్టాఫ్ నర్సుకు షోకాజ్ నోటీసు

గుత్తి: వైద్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో గుత్తి సీహెచ్‌సీ వైద్యులు ఎ.రమ్యశ్రీ, ఎస్.రమశ్రీతో పాటు స్టాఫ్ నర్సు రామాంజినమ్మకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యల్లప్ప మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సోమవారం మారెప్ప అనే రోగి జ్వరంతో ఆస్పత్రికి రాగా, చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో మారెప్ప మృతికి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేశారు. ఈ క్రమంలో వైద్యులు, స్టాఫ్‌నర్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ తీసుకున్నారు.

నీట్ పీజీ ఫలితాల్లో సత్తా చాటిన డాక్టర్ వరుణ్



డాక్టర్ వరుణ్‌కుమార్

కళ్యాణదుర్గం రూరల్: జాతీయ స్థాయిలో జరిగిన నీట్ పీజీ–2025 పరీక్షల్లో కళ్యాణదుర్గం పట్టణ ప్రముఖుడు ఏసీ తిప్పేస్వామి మనవడు డాక్టర్ వరుణ్ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 3న నీట్ పీజీ 2025 పరీక్ష ఒకే షిఫ్ట్‌లో జరిగింది. దీని ద్వారా ఎండీ, ఎంఎస్, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. తాజాగా ఫలితాలను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ అధికారికంగా ప్రకటించింది. మైసూర్‌లో ఇటీవల ఎంబీబీఎస్ పూర్తి చేసిన డాక్టర్ వరుణ్‌కుమార్... నీట్ పీజీ–2025 పరీక్షల్లో 650/800 మార్కులతో జాతీయ స్థాయిలో 290 ర్యాంక్‌ను దక్కించుకున్నారు. ప్రతిభ చాటిన డాక్టర్ వరుణ్‌కుమార్‌ను మిత్రులు, బంధువులు అభినందించారు.

అంబులెన్స్ డ్రైవర్ అజాగ్రత్త.. వ్యక్తి మృతి



వేణుగోపాల్ (ఫైల్)

అనంతపురం: అంబులెన్స్ డ్రైవర్ అజాగ్రత్త ఓ ద్విచక్ర వాహన చోదకుడి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని విద్యుత్ నగర్ రోడ్డులో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ దర్మకర్త ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్ రేకునార్ వేణుగోపాల్ సోమవారం సాయంత్రం 5 గంటలకు ఆలయానికి వెళ్లి రాత్రి 8.15 గంటలకు ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. విద్యుత్ నగర్ సర్కిల్‌లోని కుమార్ ఆస్పత్రి వద్దకు చేరుకోగానే ఓ అంబులెన్స్ (ఏపీ39టీఎస్0767) డ్రైవర్ ఉన్నఫళంగా కుడివైపు డోర్ తీయడంతో అప్పటికే అత్యంత సమీపంలోకి చేరుకున్న వేణుగోపాల్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. తలకు తీవ్ర రక్తస్రావమవుతున్న వేణుగోపాల్‌ను వెంటనే కుమార్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో నగరంలోని మరో కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి వేణుగోపాల్ మృతి చెందాడు. తన భర్త మృతికి అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని, అతనిపై చర్యలు తీసుకోవాలంటూ మృతుడి భార్య నాగరత్నమ్మ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సర్పంచ్ మోనాలిసాకు కలెక్టర్ అభినందన



సర్పంచ్ మోనాలిసాకు రాష్ట్ర మహిళాశిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ పంపిన అభినందన లేఖను అందజేస్తున్న ఎంపీడీఓ దామోదరరెడ్డి

అనంతపురం అర్బన్/వజ్రకరూరు: జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక 'సర్పంచ్ సంవాద్' కార్యక్రమంలో పాల్గొని చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్ అనే థీమ్‌తో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి జాతీస్థాయి పురస్కారానికి ఎంపికైన వజ్రకరూరు పంచాయతీ సర్పంచ్ ఎం.మోనాలిసాను కలెక్టర్ వినోద్‌కుమార్ అభినందనలు తెలిపారు. సర్పంచ్‌ను అభినందిస్తూ రాష్ట్ర మహిళాశిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సూర్యకుమారి లేఖ కలెక్టర్‌కు మంగళవారం అందింది. ఈ లేఖను మోనాలిసాకు ఎంపీడీఓ దామోదరరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సర్పంచ్ మోనాలిసా జాతీయస్థాయిలో ప్రశంసనీయమైన విజయాన్ని సాధించి జిల్లా కీర్తిని దేశవ్యాప్తం చేశారని అన్నారు. డైరెక్టర్ అభినందిస్తూ తన లేఖలో... నిరంతర మార్గదర్శకత్వం, సమన్వయం ద్వారా జిల్లా యంత్రాంగం గ్రామంలో బాలలకు అనుకూలమైన కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషదాయకమైందని పేర్కొన్నారు. బాలల విద్య, బాల్య వివాహాల నివారణ, బాల కార్మికులు, బాల యాచక నిర్మూలనకు కృషి చేయడం అభినందనీయమన్నారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి ఫిట్‌నెస్ కోసం యోగా కార్యక్రమాలు ప్రోత్సహించడం, మిషన్ వాత్సల్య లక్ష్యాలను చురుకుగా ప్రోత్సహిస్తున్నారని అన్నారు.

'డీఎస్సీ' సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రత్యేక బృందాలు

అనంతపురం ఎడ్యుకేషన్: మెగా డీఎస్సీలో భాగంగా ప్రొవిజినల్ సెలక్షన్ జాబితాకు ఎంపికయ్యే అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16 బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో ముగ్గురు సభ్యులుంటారు. ఎంఈఓ/హెచ్‌ఎంలు, సాంకేతిక పరిజ్ఞానం కల్గిన ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు. అభ్యర్థుల విద్యార్హతల మార్కులు, లోకల్, నాన్ లోకల్ తదితర సర్టిఫికెట్లను వీరు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఇందుకు సంబంధించి బుధవారం విజయవాడలో ఒక రోజు శిక్షణ కూడా ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబుతో పాటు పలువురు సిబ్బంది మూడు రోజులుగా అక్కడే మకాం వేసి జాబితా ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. నేడో, రేపో తాత్కాలిక ఎంపిక జాబితా వెలువడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

జైళ్ల శాఖ పెట్రోల్ బంకుల్లో అక్రమాలు

- ధర్మవరంలోని పెట్రోల్ బంకులో రూ.20 లక్షల అవినీతి
- అడ్డగోలు వ్యవహారంలో నలుగురి చేతివాటం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: జైళ్ల శాఖ కడప రేంజ్ డీఐజీ పరిధిలోని పెట్రోల్ బంకుల్లో అవినీతి తవ్వేకొద్దీ బయట పడుతోంది. పలువురు సిబ్బంది బంకుల్లోని సొమ్ము కాజేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలోని పెట్రోల్ బంకు పరిధిలో అప్పటి డీఐజీ, అనంతపురం డీఎస్‌డీఓ, అక్కడ జైలర్‌గా పనిచేస్తూ బదిలీపై కడప కేంద్ర కారాగారానికి వచ్చిన మరో జైలర్, ధర్మవరంలో పనిచేస్తూ ప్రస్తుతం తాడిపత్రికి బదిలీపై వెళ్లిన డిప్యూటీ జైలర్ ఈ వ్యవహారంలో చేతివాటం ప్రదర్శించినట్లు తెలిసింది. సదరు డిప్యూటీ జైలర్ పెట్రోల్ బంకు నిర్వహణ ఛార్జ్ డీఎస్‌డీఓకు అప్పగించే క్రమంలో ఈ లొసుగులు బయటపడినట్లు తెలిసింది. రూ.20 లక్షల మేర పెట్రోల్ బంకు డబ్బులు, రూ.1.50 లక్షలు పీపీసీ (ప్రిజనర్స్ పార్టిసిపేషన్ క్యాష్) తక్కువగా ఉండడంతో డీఎస్‌డీఓ ఛార్జ్ తీసుకునేందుకు నిరాకరించారు. దీంతో ప్రస్తుతం వార్డర్‌లే పెట్రోల్ బంకు నిర్వహిస్తున్నారు. అప్పటి కీలక అధికారి పెద్ద మొత్తంలో డబ్బును తన అవసరాలకు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఆ అధికారి తీసుకున్న మొత్తం డబ్బు బంధువులు, వార్డర్స్ ఫోన్‌పేల రూపంలో చెల్లించినట్లు సమాచారం. డిప్యూటీ జైలర్ తాను చెల్లించాల్సిన డబ్బును చెల్లించకపోవడం, ఇతర కారణాలతో అప్పట్లో డిపార్ట్‌మెంట్ అతన్ని డిస్మిస్ చేసింది. ఆ డిప్యూటీ జైలర్ వాడుకున్న మొత్తాన్ని ఎవరు కట్టాలో.. దిక్కుతోచక ఒక కమిటీని నియమించి కడప రేంజ్ డీఐజీ విచారణ జరుపుతున్నట్లు సమాచారం. అలాగే నంద్యాల జిల్లా బనగానపల్లిలోని పెట్రోల్ బంక్‌లోనూ రూ. 62 లక్షల మేరకు అవినీతి జరిగినట్లు గుర్తించారు. అవినీతికి పాల్పడిన వారిలో ప్రధానంగా కర్నూలు డీఎస్‌డీఓతో పాటు, డిప్యూటీ జైలర్, ఓ హెడ్ వార్డర్ ఉన్నట్లు తెలిసింది. అవినీతికి ఊతమిచ్చిన డీఎస్‌డీఓకు అడిషనల్ ఎస్పీ ర్యాంక్‌తో పదోన్నతి కల్పించేందుకు రంగం సిద్ధమైన తరుణంలో అక్రమాలు బయటపడడం గమనార్హం.

డీడీఓగా నాగశివలీల



అనంతపురం సిటీ: అనంతపురం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి (డీడీఓ)గా నాగశివలీల మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఆమె 2007లో ఎంపీడీఓగా ఎంపికై కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో పని చేశారు. ఆ తరువాత ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ కేంద్రంగా సెర్ప్‌లో పని చేశారు. అక్కడి నుంచి మెప్మా, డీఆర్‌డీఏ పీడీగా కర్నూలు జిల్లాలో పని చేశారు. ఇప్పుడు బదిలీలపై అనంతపురం రెగ్యులర్ డీడీఓగా వచ్చారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సిటీ: తపాలా శాఖ ఆధ్వర్యంలో అందించే దీన దయాళ్ స్పర్శ యోజన స్కాలర్‌షిప్ కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ బి.లక్ష్మన్న మంగళవారం తెలిపారు. తపాలా సేవలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే ఉద్దేశంతో ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు వివరించారు. గడిచిన విద్యా సంవత్సరంలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. స్కాలర్‌షిప్ ఎంపిక కోసం రెండు రకాల పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి రూ.6 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు వ్యక్తిగతంగా గానీ, స్కూల్ ప్రధానోపాధ్యాయుడి ద్వారా గానీ రూ.200తో అనంతపురం, గుంతకల్లులోని ప్రధాన తపాలా కార్యాలయాల్లో ఖాతాలు తెరచి, దరఖాస్తుకు జత చేసి సూపరింటెండెంట్, పోస్ట్, అనంతపురం– 515001 చిరునామాకు స్పీడ్‌పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలని సూచించారు.

సెలవులో జెడ్పీ సీఈఓ

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ) శివశంకర్ సెలవులో వెళ్లారు. 10 రోజుల సెలవు కావాలని ఆయన లెటర్ పెట్టగా.. వారం రోజులకు మాత్రమే కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఆ తరువాత ఆయన సెలవు పొడిగించుకునే అవకాశం ఉంటుందని జెడ్పీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కాగా, గత సీఈఓ రామచంద్రారెడ్డి పట్టుమని మూడు నెలలు తిరక్కనే ఆయనను టీడీపీ ఎమ్మెల్యేలు టార్గెట్ చేసి బలవంతంగా సాగనంపిన సంగతి దుమారం రేపింది. తరువాత శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరంలో డ్వామా ఏపీడీగా పని చేస్తున్న శివశంకర్‌ను జెడ్పీ సీఈఓగా బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆయన రాకను ఓ ద్వితీయ శ్రేణి అధికారి జీర్ణించుకోలేక లోలోన పొగబెడుతుండడంతో చివరకు సెలవులో వెళ్లాల్సి వచ్చిందని జెడ్పీ ఉద్యోగులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన మళ్లీ వస్తారో.. లేదో అనే విషయంపై చర్చ నడుస్తోంది.

అంతర్ జిల్లా చైన్‌స్నాచర్ల అరెస్ట్

- రూ.4 లక్షల విలువ చేసే బంగారు నగలు స్వాధీనం



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం: సులువుగా డబ్బు సంపాదించేందుకు బంగారు చైన్‌లను లాక్కొని ఉడాయిస్తున్న ఇద్దరు అంతర్ జిల్లా చైన్ స్నాచర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతపురం మూడో పట్టణ పీఎస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ శాంతిలాల్ వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడకు కంబం నాగార్జున అలియాస్ నాగార్జున రెడ్డి ఉరఫ్ చిన్నా, బోజనోల వరప్రసాద్ అలియాస్ ప్రసాదు ఇద్దరూ మంచి స్నేహితులు. బతుకు తెరువు కోసం నాగార్జున అనంతపురానికి వలస వచ్చి విజయనగర కాలనీలో నివాసముంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వరప్రసాద్ సైతం కదిరికి వలస వెళ్లి అక్కడి ఎరికల కాలనీలో నివాసముంటున్నాడు. నాగార్జునకు పేకాట, మద్యం సేవించడం, ఇతర చెడు వ్యసనాల కారణంగా అప్పుల పాలయ్యాడు. ఈ క్రమంలో అప్పులు, వ్యసనాలు తీర్చుకునేందుకు చైన్‌స్నాచింగ్‌లకు పథకం రచించి, వరప్రసాద్‌ను అనంతపురానికి రప్పించుకున్నాడు. అనంతరం ఇద్దరూ కలసి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ వచ్చారు. ఈ ఏడాది జూన్ 21న నేషనల్ పార్క్ ఎదురుగా స్కూటీపై ఇద్దరు మహిళలను మోటార్ సైకిల్‌పై అనుసరిస్తూ స్కూటీ నడుపుతున్న ఆమెతో మాట కలిపి వెనుక చక్రంలో గాలి తగ్గిందని బుకాయించారు. వారి మాటలు నమ్మిన ఆమె స్కూటీని ఆపి వెనుక చక్రం వైపు తొంగి చూస్తుండగా ఆమె మెడలోని బంగారు మాంగల్యం చైన్‌ను లాక్కొని ఉడాయించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో మంగళవారం అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఇద్దరు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ. 4లక్షలు విలువ చేసే 23 గ్రాముల బరువు కలిగిన బంగారు చైను, 1.5 గ్రాముల బరువులున్న ఒక బంగారు తాళిబొట్టు, ఒక బంగారు లక్ష్మీకాసు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

యూరియా 'నో స్టాక్'




డీసీఎంఎస్ వద్ద యూరియా నోస్టాక్ బోర్డు పెట్టిన అధికారులు, ధర్నా చేస్తున్న రైతులు

- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం

అనంతపురం అగ్రికల్చర్: యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదు. పది రోజులుగా జిల్లా వ్యాప్తంగా యూరియా కొరత రైతులను తీవ్రస్థాయిలో వేధిస్తోంది. విస్తారంగా వర్షాలు పడటంతో వేరుశనగ, కంది, ఆముదం, మొక్కజొన్న, అరటి తదితర పంటలకు యూరియా వేసుకోవాల్సి ఉండటంతో దాని కోసం పడిగాపులు కాస్తున్నారు. డిమాండ్ తగ్గట్టు సరఫరా లేకపోవడంతో చాలా ప్రాంతాల్లో యూరియా లభించడం లేదు. ముందస్తు చర్యలు చేపట్టడంలో చంద్రబాబు ప్రభుత్వం, వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ విఫలం కావడంతో రైతుకు అవస్థలు అధికమయ్యాయి. యూరియా కోసం జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్‌కు మంగళవారం కూడా రైతులు ఎగబడ్డారు. పరిసర మండలాల నుంచి ఉదయం 8 గంటలకే పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కానీ యూరియా సరఫరా కాలేదని 'నోస్టాక్' బోర్డు పెట్టడంతో రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. సీపీఎం అనుబంధ ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, పండ్లతోటల రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి తదితరులు డీసీఎంఎస్ వద్దకు చేరుకుని రైతులకు మద్దతుగా డీసీఎంఎస్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. డీసీఎంఎస్ ఎదుట ధర్నాకు దిగారు. ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రూరల్ ఏఓ వెంకటకుమార్ చేరుకుని రైతులు, రైతు సంఘం నాయకులతో మాట్లాడారు. సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ దుకాణంలో ఉన్న 60 బస్తాలు యూరియా రెండు బస్తాలు చొప్పున రైతులకు పంపిణీ చేయించారు. యూరియా సమస్య వేధిస్తుండటంతో తమ పరిస్థితి దారుణంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'పచ్చ' నేత గోదాములో యూరియా అన్‌లోడ్

- ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు
- 'మా ప్రభుత్వం... మా ఇష్టం' అంటూ రెచ్చిపోయిన 'పచ్చ' నేత
- వైఎస్సార్‌సీపీ నాయకుడు సూర్యనారాయణరెడ్డిపై దాడి



టీడీపీ నేత రమేష్ గోదాములో యూరియా బస్తాలు అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం



విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కణేకల్లు: మండలంలోని బెణికల్లు గ్రామంలో ఓ లారీ యూరియా లోడ్‌ను టీడీపీ నేత రమేష్ గోదాములో అన్‌లోడ్ చేయడం వివాదాస్పదంగా మారింది. దీనిపై ప్రశ్నించిన రైతులపై 'పచ్చ' నేత రెచ్చిపోవడమే కాకుండా వైఎస్సార్ సీపీ నాయకుడిపై దాడి చేశాడు. వివరాలు.. ఇటీవల బెణికల్లు హెచ్చెల్సీ ఆయకట్టులో వరినాట్ల ప్రక్రియ ఊపందుకుంది. యూరియా దొరక్క రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం బెణికల్లు ఆర్‌ఎస్‌కేకు లారీలో యూరియా బస్తాలు పంపారు. వర్షం వచ్చి ఆర్‌ఎస్‌కే వద్ద గుంతలు పడటంతో లారీ ఇరుక్కుపోతుందని భావించిన వ్యవసాయశాఖ అధికారులు మరోచోట అన్‌లోడ్ చేయాలనుకొన్నారు. పాత గ్రామ పంచాయతీ కార్యాలయం అందుబాటులో ఉన్నా టీడీపీ నేత ప్రోద్బలంతో ఆయన గోదాములో యూరియా అన్‌లోడ్ చేయాలని నిర్ణయించి లారీని అక్కడికి పంపారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు గోదాము వద్దకెళ్లి వీఏఏ శ్రావణితో వాగ్వాదానికి దిగారు. గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం ఉండగా టీడీపీ నేత గోదాములో ఎలా అన్‌లోడ్ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు సూర్యనారాయణరెడ్డి, భీమిరెడ్డి ప్రశ్నించారు. దీని వెనుకున్న ఆంతర్యమేమిటని నిలదీశారు. ఈ క్రమంలోనే టీడీపీ నేత రమేష్ రెచ్చిపోయాడు. 'ప్రభుత్వం మాది.. మా ఇష్టమొచ్చినట్లు చేస్తాం.. ఇష్టమొచ్చిన చోట దింపుతాం.. నీదేందిరా' అంటూ సూర్యనారాయణపై దాడి చేశాడు.

టీడీపీ వారికి పంపిణీ చేయాలనే..

తమకు అనుకూలంగా ఉన్నోళ్లకి యూరియా పంపిణీ చేయాలనే ఉద్దేశంతోనే టీడీపీ నాయకుడు తన గోదాములో అన్‌లోడ్ చేయించారని వైఎస్సార్‌సీపీ నాయకులు సూర్యనారాయణరెడ్డి, భీమిరెడ్డి, సంగప్ప ఆరోపించారు. ప్రయివేటు గోదాములో అన్‌లోడ్ చేయడం తప్పని ప్రశ్నిస్తే ఎదురుదాడి చేయడం దుర్మార్గమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు తమ పార్టీకి అనుకూలురైన రైతులు అక్కడికెళ్లి యూరియా తీసుకోరనే విషయం తెలిసే తమ గోదాముల్లో దింపుకుంటున్నారన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా యూరియా పంపిణీ చేయాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

మాంటిస్సోరి ఎలీట్ విద్యార్థుల ప్రతిభ



వాలీబాల్ క్రీడలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

రాప్తాడు: గొల్లపల్లి సమీపంలో ఉన్న మాంటిస్సోరి ఎలీట్ పాఠశాల విద్యార్థులు అంతర్ రాష్ట్ర స్థాయి వాలీబాల్, ఖోఖో పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ఎండీ కృష్ణ భరత్, పాఠశాల కరస్పాండెంట్ సమీరా తెలిపారు. జూలై 24, 23, 26 తేదీల్లో హైదరాబాద్‌లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో జరిగిన వాలీబాల్ అండర్–19 బాలికల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారన్నారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో రాజమండ్రి తునిలో జరిగిన ఖోఖో అండర్–17 బాలికల విభాగం ఇంటర్ స్టేట్ లెవెల్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. మంగళవారం పాఠశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులతోపాటు కోచ్‌లు టిప్పు సుల్తాన్, వీరన్నను అభినందించారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి


గర్భిణికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి శివకృష్ణ

రాప్తాడు: సుఖ ప్రసవం కోసం హైరిస్క్ గర్భిణులు జాగ్రత్తలు తప్పక పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి శివకృష్ణ తెలిపారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో మండలంలోని హైరిస్క్ గర్భిణులకు రక్త పరీక్ష, బీపీ, డయాబెటీస్, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా 9, 10వ తేదీలు, గర్భం దాల్చిన 4వ నెల నుంచి 9వ నెల వరకు తప్పనిసరిగా పరీక్ష చేయించుకోవాలన్నారు. అనంతపురానికి చెందిన పెట్లు చంద్రకాంత్, పెట్లు కళ్యాణ్ సోదరులు 50 మంది గర్భిణులు, సిబ్బందికి భోజన వసతి ఏర్పాటు చేశారు. సీహెచ్‌ఓ శివ ప్రసాద్, సూపర్‌వైజర్స్ నరసింహ, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి


పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున

రాప్తాడు: ఈ నెల 23 నుంచి బంగోలులో జరగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున కోరారు. మంగళవారం స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. మహాసభలకు రాప్తాడు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రుద్రంపేట పాఠశాలకు దాతల సహకారం


పాఠశాలకు దాతలు అందజేసిన డ్రమ్స్, మైక్‌సెట్, లౌడ్ స్పీకర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: నగర శివారులోని రుద్రం పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాతల సహకారంతో వివిధ వస్తువులు విరాళంగా అందజేశారు. పతకమూరి కుమార్‌నాయుడు రూ. 30 వేలు విలువ చేసే డ్రమ్స్, జూటూరు వెంకటేష్ రూ.30 వేలు విలువ చేసే మైక్‌సెట్, లౌడ్ స్పీకర్లు అందించారు. పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకరించడం పట్ల వారిని హెచ్‌ఎం జె.సుమంగళి అభినందించారు. విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

నేటి 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' వాయిదా

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో బుధవారం జరగాల్సిన బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం వాయిదా వేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు పోలీసుల అనుమతించక పోవడంతో కార్యక్రమాన్ని వాయిదా వేశామని, త్వరలో కార్యక్రమం నిర్వహించే తేదీ ప్రకటిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు గమనించాలని కోరారు.

గణపయ్యల సందడి

నగరంలో వినాయక చవితి సందడి మొదలైంది. నగర శివారు ప్రాంతాలతోపాటు నగరంలోని పలుచోట్ల వినాయక విగ్రహాల విక్రయాలు మొదలయ్యాయి. బళ్లారి చౌరస్తా, సిండికేట్‌నగర్, కొడిమి, నడిమివంక ప్లై ఓవర్, గుత్తి రోడ్డు ప్రాంతాల్లో విగ్రహాల విక్రయం జోరుగా సాగుతోంది. ఒక్కో విగ్రహాన్ని సైజ్, మోడల్‌ను బట్టి రూ.5 వేల నుంచి రూ.90 వేల వరకూ విక్రయిస్తున్నారు. చాలా మంది ముందస్తుగానే విగ్రహాలను ఆర్డర్ పెట్టినట్లు తయారీదారులు చెబుతున్నారు. ఈ ఏడాది విగ్రహాల విక్రయం ఆశాజనకంగా ఉందని పేర్కొంటున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


రెడీ ఫర్ సేల్: విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయకప్రతిమలు


తుది మెరుగులు: వినాయక ప్రతిమలకు రంగులు దిద్దుతున్న కార్మికులు


లంబోదర నమోనమః : అందంగా రూపుదిద్దుకున్న గణపయ్య


జరభద్రం : వినాయక ప్రతిమలను వాహనంలోకి ఎక్కిస్తున్న కార్మికులు


టాటా వెళ్లొస్తా: వినాయక ప్రతిమలను తరలిస్తున్న దృశ్యం

ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం

● మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

అనంతపురం అర్బన్: 'నగరంలో ఎక్కడ చూసినా రోడ్లు గుంతలమయమై ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయి. మరమ్మతు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది' అని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తీవ్రస్థాయిలో విమర్శించారు. తపోవనం రోడ్డు బాగు చేయాలని, నడిమివంకకు రక్షణగోడ నిర్మించాలని, రిషిత స్కూల్ వద్ద బ్రిడ్జి నిర్మించాలంటూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం రెండో రోజు కొనసాగాయి. గేయానంద్ దీక్షలకు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. నగర పాలక సంస్థ బడ్జెట్‌లో ఒక్క శాతం ఖర్చు చేసి బ్రిడ్జి నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందన్నారు. ప్రజాశ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రిషిత స్కూల్ సమీపంలోని బ్రిడ్జిని నిర్మించాలన్నారు. తపోవనానికి వెళ్లేదారి బాగు చేయాలని, నడిమివంకకు రక్షణగోడ నిర్మించాలన్నారు. సిటిజన్ ఫోరం నాయకుడు రాజమోహన్ మాట్లాడుతూ నడిమివంకకు రక్షణగోడ లేని కారణంగా గతంలో వరదలు వచ్చినప్పుడు నిరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురయ్యారన్నారు. దీక్షలకు పలు ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు ప్రకాష్, వెంకట్, నారాయణ, ఇర్ఫాన్, రాజు పాల్గొన్నారు.


రిలే దీక్షల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

సందడిగా ఫొటోగ్రఫీ దినోత్సవం

అనంతపురం/ అనంతపురం కల్చరల్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని టవర్‌క్లాక్ సమీపంలోని అనంతపురం డాగురె ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మోహనరెడ్డి నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా విచ్చేసిన ఫొటోగ్రాఫర్లు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కృత్రిమ మేధ విస్తృతమవుతున్న సందర్భంలో ఫొటోగ్రఫీ ప్రాధాన్యత తగ్గిపోతుండడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా రూడ్‌సెట్‌లో సీనియర్ ఫొటోగ్రాఫర్ కృపాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. సమావేశానికి ఢిల్లీ నుంచి ఉమేష్ మెహతా, విజయవాడ నుంచి డాక్టర్ టీఎస్ వరప్రసాద్ హాజరై ఫొటోగ్రఫీలోని మెలవకలను వివరించారు. ప్రదర్శనలోని పలు చిత్రాలు చూడముచ్చటగా ఉన్నాయని వారిని ప్రశంసించారు. కార్యక్రమంలో డైరెక్టర్ విజయలక్ష్మి, నాగేంద్ర, ఇలియాజ్, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.


డాగురే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

గణితం చాలా సులభం

అనంతపురం ఎడ్యుకేషన్: అర్థం చేసుకుంటే గణితం చాలా సులభమని ప్రొఫెసర్ లెనిన్‌బాబు పేర్కొన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కేవీఆర్ బాలికల పాఠశాలలో 9,10 తరగతుల విద్యార్థినులకు 'గణిత పాఠ్యాంశాలు సులభంగా ఎలా అర్థం చేసుకోవాలి' అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ లెనిన్ బాబు మాట్లాడుతూ గణితం సబ్జెక్టు అర్థం చేసుకుంటే పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావచ్చన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం నిర్వహించబోయే పోటీ పరీక్షల్లోనూ ఉద్యోగాలు సులభంగా సాధించవచ్చన్నారు. ఆల్జీబ్రా, ట్రిగ్నోమెట్రీ, బొడ్మాస్ రూల్ లాంటివి తెలుసుకుంటే పెద్ద పెద్ద మ్యాథమెటిక్స్ ప్రాబ్లమ్స్‌ను సులువుగా పరిష్కరించవచ్చన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ 9,10 తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయం కలగకుండా ఉండకూడదనే ఉద్దేశంతో అవగాహన కోసం ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. హెచ్‌ఎం బాలకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు తరిమెల గిరి, నాయకులు విజయ్, ఉపాధ్యాయులు నాగరాజు, పద్మజ, కవిత ,అమరేంద్ర పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రొఫెసర్ లెనిన్‌బాబు

అత్త, బావమరిదిపై కొడవలితో దాడి

పెద్దవడుగూరు: మండలంలోని జి.వెంకటాంపల్లికి చెందిన మురళి అనే వ్యక్తి అత్త సాలమ్మ, బావమరిది నరసింహపై మంగళవారం కొడవలితో దాడి చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. సాలమ్మ కూతురు వరలక్ష్మితో అదే గ్రామానికి చెందిన మురళి అనే వ్యక్తికి ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఏడు నెలల క్రితం ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో వరలక్ష్మి పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం జరిగిన ఘర్షణలో బావమరిది, అత్తకు గాయాలయ్యాయి. వారిని వెంటనే పామిడికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ బోల్తా - ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో మంగళవారం బైక్ అదుపు తప్పి ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలు.. గుంతకల్లుకు చెందిన రాముడు, వినయ్ బైక్‌లో పని మీద గుత్తికి వచ్చారు. తిరిగి వెళుతున్న సమయంలో రోడ్డు అధ్వానంగా ఉండటంతో.. బైక్ అదుపు తప్పి రోడ్డుపై ఉన్న గుంతలో పడింది. ఘటనలో గాయపడిన ఇద్దరినీ స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బంగారు గొలుసు అప్పగింత

గుంతకల్లు రూరల్: స్వామివారి దర్శనార్థం కసాపురం వచ్చిన భక్తులు పోగొట్టుకున్న బంగారు గొలుసును కసాపురం పోలీసులు వెతికి తిరిగి అప్పగించారు. బళ్లారికి చెందిన దానాంజనేయులు అనే భక్తుడు తన భార్య, కూతురుతో నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శనార్థం సోమవారం రాత్రి కసాపురం వచ్చాడు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఆ సమయంలో ఆయన కూతురు మెడలో ఉన్న 1.5 తులాల బంగారు గొలుసు జారి కింద పడిపోయింది. వెంటనే కసాపురం ఎస్ఐ టీపీ వెంకటస్వామికి ఫోన్‌లో ఫిర్యాదు చేశాడు. కానిస్టేబుల్ ఓబులేసును అప్రమత్తం చేసిన ఎస్ఐ సీసీ ఫుటేజీలను పరిశీలించాని సూచించారు. ఫుటేజీల ఆధారంగా కింద పడిన బంగారు గొలుసును ఓ మహిళ తీసుకుని కేసరి సదనం వైపు వెళ్లినట్లు గుర్తించారు. వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుని మహిళను గుర్తించి ఆమె నుంచి చైన్ రికవరీ చేశారు. పోగొట్టుకున్న గొలుసును మంగళవారం ఉదయం తిరిగి భక్తుడికి అందజేయడంతో.. ఆయన కసాపురం పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.


బంగారు గొలుసును భక్తుడికి అందజేస్తున్న ఎస్ఐ టీపీ వెంకటస్వామి

డీడీఓ కార్యాలయం కోసం భవనాల పరిశీలన

అనంతపురం సిటీ: డివిజనల్ డెవలప్‌మెంట్(డీడీఓ) కార్యాలయం కోసం అవసరమైన భవనాలను అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. అనంతపురం డివిజన్‌కు సంబంధించి ప్రస్తుతం జెడ్పీ క్యాంపస్‌లోని డీపీఆర్‌సీలోని పలు గదుల్లో కార్యాలయాన్ని నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే అక్కడి నుంచి డీడీఓ కార్యాలయాన్ని తరలించాలని జెడ్పీ పాలకవర్గం, అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో జెడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, పంచాయతీరాజ్ సబ్ డివిజన్–1, 2 డీఈఈలు లక్ష్మీనారాయణ, జింకల కృష్ణజ్యోతి, పీఆర్ ఏఈ శేషయ్య, డీడీఓ నాగశివలీల జెడ్పీ క్యాంపౌండ్‌లోని పాత భవనాలను పరిశీలించారు. అయితే ఏ భవనాన్ని ఎంపిక చేస్తారన్న విషయం ఇంకా ఒక కొలిక్కి రాలేదు. రెండు, మూడు రోజుల్లో ఒక నిర్ణయానికి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.


జెడ్పీ ఆవరణలోని పాత భవనాలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

పంటల నమోదు తప్పనిసరి

రాప్తాడు: రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను తప్పక నమోదు చేయించుకోవాలని ఏఓ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. మంగళవారం గొందిరెడ్డిపల్లి, బొమ్మేపర్తి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. వేరుశనగ పంట పూత దశలో ఉందని నాలుగు బస్తాయి జిప్సం వేయడం వల్ల అధిక దిగుబడి పొందడమే కాకుండా గింజలో నూనె శాతం పెరుగుతుందన్నారు. క్రిమి సంహారక మందుల పిచికారీ కోసం ప్రభుత్వం కిసాన్ డ్రోన్లను 80 శాతం రాయితీపై అందజేస్తోందని, ఆసక్తి కలిగిన రైతులు ఐదుగురు కలిసి గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అన్నదాన సుఖీభవ డబ్బు అందని వారు రైతు సేవ కేంద్రంలో ఫిర్యాదును నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏఈఓలు సుజిత, రంజిత, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


రైతులకు సూచలిస్తున్న ఏఓ కృష్ణ చైతన్య

కొడిమి ఉప సర్పంచ్ ఆకస్మిక మృతి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి ఉప సర్పంచ్ నాగరాజు(43) ఆకస్మికంగా మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు...నాగరాజు కుటుంబం కొడిమి పంచాయతీలోని జ్యోతిబసుకాలనీలో నివాసం ఉంటోంది. కూడేరు మండలం ఇప్పేరు గ్రామానికి చెందిన ఈయన 15 ఏళ్ల కిందట వలస వచ్చి ఇక్కడే స్థిరపడ్డాడు. ఈయన భార్య, ఇద్దరు కుమారులున్నారు. భార్య,భర్తలిద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వైఎస్సార్‌సీపీలో చురుకుగా పని చేసేవాడు. ఇటీవల ఒకసారి రక్తవాంతులయ్యాయి. ఆ సమయంలో వైద్యం చేయించుకున్నాడు. అదే తరహాలో మంగళవారం ఉదయం మరోమారు రక్తవాంతులయ్యాయి. వెంటనే నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి సంతాపం తెలియజేశారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. పార్టీ మంచి కార్యకర్తను కోల్పోయిందని, ఆయన కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని పేర్కొన్నారు


నాగరాజు (ఫైల్)

ఆర్డీటీ సంస్థను కాపాడుకుందాం

ఆత్మకూరు: జిల్లాలో ఎంతో మంది విద్యార్థులకు, రైతులకు, పేదలకు సహాయం చేసి అండగా నిలిచిన ఆర్డీటీ సంస్థను కాపాడుకుందామని ఆర్డీటీ పరిరక్షణ జేఏసీ సభ్యులు, సంస్థ లబ్ధిదారులు, మహిళా సంఘాల పేర్కొన్నారు. ఈ మేరకు ఆత్మకూరులో మంగళవారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి సేవ్ ఆర్డీటీ అంటూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్‌ను వెంటనే రెన్యూవల్ చేయాలన్నారు. పేదలకు ఆర్డీటీ సంస్థను దూరం చేస్తే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మకు వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎగ్గిడి వన్నూరప్ప, ఓబీ టైలర్ వెంకటేష్, నరసింహులు, వెంకటేశులు, వార్డు మెంబర్ ఈశ్వరయ్య, తిక్కస్వామి, పెద్దన్న, శేఖర, కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

ప్రమాదంలో వ్యక్తి మృతి

బుక్కరాయసముద్రం: బైక్ అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బీకేఎస్ మండలం నీలంపల్లికి చెందిన రాజు (50), గోవిందపల్లి నివాసి ఈశ్వరరెడ్డి సొంత పనిపై మంగళవారం అనంతపురానికి వెళ్లారు. అక్కడ పని ముగించుకున్న అనంతరం గోవిందపల్లికి బైక్‌పై తిరుగు ప్రయాణమైన వారు బోయ కొట్టాల గ్రామం వద్దకు చేరుకోగానే నియంత్రణ కోల్పోవడంతో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ఘటనలో రాజు తలకు తీవ్ర గాయం కాగా, స్వల్ప గాయాలతో ఈశ్వరరెడ్డి బయటపడ్డాడు. అటుగా వెళుతున్న వారు క్షతగాత్రులను అనంతపురం జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలో రాజు మృతిచెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కసాపురంలో మన్యుసూక్త హోమం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం మన్యుసూక్త హోమం నిర్వహించారు. అర్చకులు ఆలయ యాగశాలలో స్వామివారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య మన్యుసూక్త హోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బ్యాంక్ సేవలపై అవగాహన పెంచుకోవాలి


బ్యాంక్ సేవలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరు: ఖాతాదారులు బ్యాంక్ సేవలపై అవగాహన పెంచుకోవాలని కెనెరా బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ రాకేష్ కశ్యప్ సూచించారు. మంగళవారం సింగంపల్లితండాలో బ్యాంకింగ్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాన మంత్రి సురక్ష బీమా, జీవన్ జ్యోతి యోజన, అటల్ పెన్షన్ యోజన, రూపే కార్డు యాక్టివేషన్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ప్రజలు సైబర్ నేరాగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా సెల్‌ఫోన్‌కు వచ్చే ఎలాంటి లింక్‌లు క్లిక్ చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళగౌరి వ్రతాలు


విశేష అలంకార సేవల్లో ముత్యాలమ్మ తల్లి

అనంతపురం కల్చరల్: శ్రావణమాసం చివరి మంగళవారం సందర్భంగా సామూహిక మంగళగౌరి వ్రతాలను ముగించారు. హెచ్చెల్సీకాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయం, కొల్హాపురి మహాలక్ష్మి మందిరంలో విశేష అలంకార సేవల్లో అమ్మవారు పూజలందుకుంది. కొత్తూరు, పాతూరు వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయాలు, అశోక్‌నగర్‌లోని హరిహరదేవాలయం, రమాదేవి సమేత సత్యనారాయణ స్వామి ఆలయం, సాయినగర్‌లోని కనకదుర్గా అమ్మవారి ఆలయాల్లో మహిళలు వ్రతమాచరించారు. ఇందులో భాగంగా మహిళలకు వాయనాలు, పసుపుకుంకుమలు, గాజులనందించారు. పలుచోట్ల అన్నసంతర్పణ జరిగింది.

ఘనంగా ఏకాదశి వేడుకలు


రుక్మిణీ, పాండురంగ స్వామి నిజరూప దర్శనం

అనంతపురం కల్చరల్: శ్రావణమాసంలో భావసార క్షత్రియులు పవిత్రంగా భావించే అజ ఏకాదశి వేడుకలు మంగళవారం రామనగర్‌లోని శ్రీరుక్మిణి విఠల పాండురంగస్వామి ఆలయంలో ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున నుంచే స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలతో పాటూ సుందరంగా అలంకార సేవలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వార్ల నిజరూప దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తిరుపతిరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడిపత్రిటౌన్: మండలంలోని బోడాయిపల్లిలో జూన్ 27న జరిగిన ఇరువర్గాల ఘర్షణలో తీవ్రంగా గాయపడి బెంగుళూరులో చికిత్స పొందుతున్న రంగనాథ్ (50) మంగళవారం మృతి చెందాడు. అతడికి భార్య వరలక్ష్మి, ఐదు మంది పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకొని వచ్చిన నేపథ్యంలో ఎలాంటి గొడవలకు తావు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.